క్లుప్తంగా

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



చిట్టివలసలో ముగ్గుల పోటీల్లో మహిళలు

తగరపువలస: సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం చిట్టివలసలో ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించింది. స్థానిక సత్యసాయి సేవా సమితి మందిరం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలతోపాటు అందరికీ బహుమతులు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో 28 మంది మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి ఆటల పోటీలు



చంద్రంపాలెం హైస్కూల్‌లో ఆటల పోటీలు ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

మధురవాడ: అత్యంత ప్రాముఖ్యత కలిగిన భోగి పండగను పురస్కరించుకుని మధురవాడ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉత్సాహంగా ఆటలు, ముగ్గులు పోటీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మధురవాడ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నక్కా శ్రీధర్, నాగోతి నానాజీ, కేశం, ఎల్.అప్పలరాజు, వాండ్రాసి కొండయ్య, ఎస్‌వీ రమణ, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యాపారాలతో ట్రాఫిక్ అవస్థలు



తగరపువలస రహదారిపైనే వ్యాపారాలు

తగరపువలస: తగరపువలస ప్రధాన రహదారిలో సంక్రాంతి మార్కెట్ శనివారం వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగించింది. సిటీ బస్సులు అంబేడ్కర్ కూడలికి రాకుండానే బైపాస్ మీదుగా వెళ్లిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ద్విచక్ర వాహనాలు సైతం దర్జాగా ప్రధాన రహదారిపైనే పార్కింగ్ చేయడంతో ఆటోలు కూడా రావడానికి అవకాశం లేకుండా పోయింది. ప్రైవేట్ మార్కెట్‌లో మూడో వంతు భాగంగా ఖాళీగా ఉన్నా జీవీఎంసీ, భీమిలి పోలీసులు రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహించుకునేలా ప్రోత్సహించారని పలువురు ఆరోపించారు. మార్కెట్‌లో చాలాభాగం ఖాళీగా ఉండగానే ప్రధాన రహదారిని వ్యాపార కేంద్రంగా మార్చడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి.

కమనీయం... గోదారంగనాథుల కల్యాణం



ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో గోదా కల్యాణం నిర్వహిస్తున్న అర్చక స్వాములు



గంభీరంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల ముగింపులో భాగంగా శనివారం గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉదయం నాలుగు గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం అర్చన, నగర సంకీర్తన, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామికి బేడా సేవ నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి విగ్రహాలను, గోదాదేవిని పల్లకీల్లో గోస్తనీ నదిలోకి తీసుకెళ్లి నీలాట్ ఉత్సవం జరిపారు. తదుపరి ప్రత్యేకంగా రూపొందించిన వేదికపై గోదా దేవి, రంగనాథ స్వామి కల్యాణం శాస్త్రోక్తంగా అర్చక స్వాములు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గాడు అప్పలరాజు, సుంకర నారాయణరావు, తాలాడ పైడిరాజు, పరిసర ప్రాంత గ్రామాల భక్తులు కల్యాణం కనులారా వీక్షించారు.

పీఎం పాలెం: క్రికెట్ స్టేడియం సమీపంలోనూ, పీఎం పాలెం మూడో బస్టాపు వద్ద గల రామాలయంలో, బక్కన్నపాలెం రోడ్డులో గల శ్రీ వేంకటేశ్వస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై గోదాదేవి కల్యాణం తిలకించారు.

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న శ్రీ శరణ్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ధనుర్మాస ఉత్సవాలు ముగింపులో భాగంగా శ్రీ గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో మంగళధ్వని, వేద మంత్రాలతో అర్చకులు కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ద్వారం త్యాగరాజు బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. ఆలయ ధర్మకర్త పైడా కృష్ణ ప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, కోన జగదీశ్వరరావు, కంకటాల మల్లిక్, సీతారామయ్య పాల్గొన్నారు.

మధురవాడ : మధురవాడ సిద్దేశ్వర స్వామి పీఠంలోని అష్టలక్ష్మి సహిత లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో ధర్మకర్త నరసింహమూర్తి ఆధ్వర్యంలో భోగి మంటలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుడు సత్య శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో గోదా రంగనాయక స్వాముల కల్యాణం కనుల విందుగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా హాజరై కల్యాణమూర్తులను దర్శించుకున్నారు.

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా గోదా రంగనాథస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వి.తాతాజీ పాల్గొన్నారు.

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీ గోదా రంగనాథుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విశ్వక్షేణ ఆరాధన, పుణ్యాహవచనం, మాంగళ్యధారణ నిర్వహించారు.

అష్టలక్ష్మి సన్నిధిలో...

అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో శనివారం గోదారంగనాథుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా లక్ష్మీ నారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మహోత్సవంలో పుష్ప సినిమా ఫేమ్ విలన్ జక్కారెడ్డి పాల్గొన్నారు.



కల్యాణంలో గోదా రంగ నాయకుల ఉత్సవమూర్తులు



అష్టలక్ష్మి సన్నిధిలో కల్యాణంలో పాల్గొన్న నటుడు జక్కారెడ్డి

ఉత్తరాంధ్రకు పోటెత్తిన జనం



శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్తూ సంగివలస కొత్తమ్మతల్లి ఆలయం వద్ద ఆగిన ప్రయాణికులు

తగరపువలస: ఉత్తరాంధ్ర వాసులతో శనివారం స్థానిక జాతీయ రహదారి, సర్వీసు రోడ్లు నిండిపోయాయి. సంక్రాంతి పండగ నిమిత్తం విశాఖ, కాకినాడ, అనకాపల్లి తదితర జిల్లాల నుంచి సొంత గ్రామాలకు తరలివెళ్తున్న కూలీలు, ఉద్యోగులతో సందడిగా కనిపించింది. వీరంతా కాసేపు సంగివలస కొత్తమ్మతల్లి ఆలయం వద్ద వాహనాలు నిలిపి అమ్మవార్ల దర్శనం అనంతరం పయనమయ్యారు. ఆదివారం మకర సంక్రాంతి వరకు ఉత్తరాంధ్ర వైపు కొనసాగే రద్దీ బుధవారం తిరుగు ప్రయాణంతో మళ్లీ ఇటువైపు కొనసాగనుంది.

రహదారులపై మంచు దుప్పటి



పీఎం పాలెం సమీపంలో జాతీయ రహదారిపై లైట్ల వెలుగులో సాగుతున్న వాహనాలు



విజయనగరం - శొంఠ్యాం రోడ్డుపై ఉదయం 9 గంటల సమయంలో లైట్లు వేసుకుని వెళ్తున్న బస్సు

పీఎం పాలెం: జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజాము నుంచి విపరీతంగా పొగ మంచు కురిసింది. హైవేపై ప్రయాణించే వాహన చోదకులు మంచు కారణంగా ఇబ్బంది పడ్డారు. వేగంగా దూసుకుపోయే వాహనాలు కాస్త నెమ్మదిగా ప్రయాణించాయి. వుడా రోడ్డు, పీఎం పాలెం ఆఖరు బస్టాపునకు వెళ్లే మాస్టర్ ప్లాన్ రోడ్డులో ప్రయాణించే వారు మంచు కారణంగా అసౌకర్యానికి గురయ్యారు. ముందరి రహదారి సరిగా కనపించకపోవడంతో ఉదయం 8 గంటల సమయంలోనూ హెడ్ లైట్ల వెలుగులో వాహనాలు ప్రయాణించాల్సి వచ్చింది.

పద్మనాభం: మండలంలో శనివారం మంచు దుప్పటి కప్పుకొంది. దీంతో మార్గం కనిపించక ప్రయాణికులు, ప్రజలు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడ్డారు. ఉదయం తొమ్మిదిన్నర గంటల సమయంలో విజయగనరం - శొంఠ్యాం, పద్మనాభం - మహారాజుపేట రోడ్లు సైతం కనిపించలేదు. ఈ రోడ్లపై విజయనగరం, సింహాచలం, తరగపువలస వెళ్లే బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాయి.

యువ క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను తదితరులు

ఆనందపురం : ఆటల్లో రాణించే యువ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను అన్నారు. గిడిజాల పంచాయతీ దిబ్బడిపాలెం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా స్థానిక యువకులు ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడా ప్రాంగణం లేకపోవడంతో గ్రామంలో ఔత్సాహిక క్రీడాకారులు ఉన్నా సాధన చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ మేరకు సుమారు రూ.లక్ష సొంత నిధులతో ప్రాంగణాన్ని తయారు చేయించి యువకులకు అందజేశామని వివరించారు. టోర్నమెంట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ షిణగం అప్పలరాజు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల సంక్రాంతి క్రికెట్ పోటీలు

తగరపువలస: సంక్రాంతి పండగ సందర్భంగా శనివారం పలుచోట్ల క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ రెండో వార్డులో క్రికెట్ పోటీలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అక్కరమాని మంగరాజు ప్రారంభించారు. భీమిలి మండలం మూలకుద్దులో ఎంపీఎల్ క్రికెట్ పోటీలను విశ్రాంత వీఆర్వో కె.ఎ.ఎస్.ఎన్.రెడ్డి, కొల్లి కోటిరెడ్డి, దువ్వి కిషోర్ తదితరులు ప్రారంభించారు. మండలంలోని అమనాంలో జేపీఎల్ క్రికెట్ పోటీలను చుక్క ఆదిరెడ్డి ప్రారంభించారు. నాలుగు జట్లు పాల్గొనగా విన్నర్ జట్టుకు రూ.50వేలు, రన్నర్ జట్టుకు రూ.10వేలు అందించనున్నట్టు నిర్వాహకుడు జువ్వాయి సురేష్ తెలిపారు.

కిటకిటలాడిన వేములవలస మార్కెట్



వేములవలస మార్కెట్‌లో పువ్వులు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆనందపురం : సంక్రాంతి సందర్భంగా వేములవలస రోజువారీ మార్కెట్ శనివారం కిటకిటలాడింది. అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తారు. జిల్లాలోనే అతి పెద్ద మార్కెట్ కావడంతో ఇక్కడ అన్ని రకాల వస్తువులతోపాటు, వివిధ రకాల పువ్వులు, పూజా సామగ్రిని సైతం వ్యాపారులు అందుబాటులో ఉంచారు. ఆదివారం సంక్రాంతి పండగ కావడంతో శనివారమే జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారు, అలాగే ఆనందపురం జంక్షన్ గుండా ప్రయాణాలు సాగించిన వారు ఇక్కడ ఆగి వివిధ రకాల వస్తులు కొనుగోలు చేశారు. దీంతో మార్కెట్ ప్రాంతం మధ్యాహ్నం వరకూ జనాలతో కిక్కిరిసింది.

ఆనందపురం జంక్షన్‌లో ట్రాఫిక్ గజిబిజి

విశాఖ, పెందుర్తి, తగరపువలస నుంచి వచ్చే వాహనాలు ఆనందపురం జంక్షన్‌లోని ఫ్లై ఓవర్ కింద నుంచే ప్రయాణించాలి. దీంతో సంక్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న వారు తమ సొంత ఊళ్లకు వాహనాలతో ఆనందపురం జంక్షన్ గుండా ప్రయాణం చేస్తున్నారు. దీంతో వందలాది వాహనాలు ఒకేసారి మూడు వైపుల నుంచి రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆనందపురం జంక్షన్ నుంచి విశాఖ వెళ్లే జాతీయ రహదారి వరకూ వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్, సిబ్బంది పర్యవేక్షించారు.

ఊరూరా ఉత్సాహంగా భోగి మంటలు



సంతపేట సన్‌రైజ్ అపార్ట్‌మెంట్ వద్ద భోగిమంట వేసిన నిర్వాహకులు



చిల్లపేటలో సంక్రాంతి సంబరాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు



స్వచ్ఛంద సంస్థల సభ్యులను సత్కరిస్తున్న ముత్తంశెట్టి మహేష్

తగరపువలస /పీఎం పాలెం /ఆనందపురం /మధురవాడ /కొమ్మాది /పద్మనాభం /భీమిలి : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మొదటిరోజైన భోగి పండగను చిట్టివలస కార్మికవాడ, తగరపువలస, సంగివలస డివిజన్ ప్రజలతోపాటు భీమిలి నియోజకవర్గ ప్రజలు శనివారం ఉత్సాహంగా జరుపుకున్నారు. వేకువజామునే మంగళస్నానాలు ఆచరించి కొత్త దుస్తులు ధరించి వీధులు, రోడ్లపై భోగిమంటలు వేశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు. భీమిలి జోన్ రెండో వార్డు సంతపేట సన్‌రైజ్ అపార్ట్‌మెంట్ వద్ద కందివలస త్రినాథరావు, సరగడ వెంకటరమణ సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిల్లపేటలో వైఎస్సార్‌సీపీ 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరి కిరణ్‌రెడ్డి, చిప్పాడ వెంకటేష్ పాల్గొన్నారు.

- భోగి పండగ సందర్భంగా శనివారం చిట్టివలస సత్యసాయి సేవాసమితిలో చిన్నారులకు నిర్వాహకులు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. టీవీఆర్ బాబా, కుంచం గోవింద్ పాల్గొన్నారు.
- పీఎం పాలెంలోని ఆర్‌హెచ్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, గాయత్రినగర్, పాత పీఎంపాలెం, మధురవాడలో పెద్ద పెద్ద భోగిమంటలు వేశారు.
- ఆనందపురం మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి పండగను శనివారం సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. కొత్త దుస్తులు ధరించి ఇళ్ల ముందు కర్రలు, పిడకలు కుప్పగా పేర్చి మంటలు వేశారు. కొత్త బియ్యంతో పాయసం చేసుకొని ఇంటిల్లపాది ఆరగించారు.
- భీమిలి బీచ్‌రోడ్డులోని గ్రంథాలయం పక్కన శనివారం సామూహిక భోగి వేడుకలు వైభవంగా, కోలాహలంగా నిర్వహించారు. భీమిలి ప్రెస్ క్లబ్, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి, సాగర్ వాకర్స్ అసోసియేషన్, బంగారం వర్తకుల సంఘం, స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్, హిందు ధర్మ పరిరక్షణ సమితి, శివాజీ సేన, మిషన్ గ్రీన్ భీమిలి తోపాటు పలువురి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా కేంద్రం గురువు వెంకటర రమణ మాట్లాడుతూ భోగి, సంక్రాంతి గొప్పదనాన్ని వివరించారు. అనంతరం ఊరిలోని పురోహితులను సత్కరించి, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ముత్తంశెట్టి మహేష్, గంటా నూకరాజు, మైలపల్లి షణ్ముఖరావు, అనిల్ ప్రసాద్, గాడు అప్పలనాయుడు, కంటుభుక్త రామానాయుడు పాల్గొన్నారు.
- కొమ్మాది, మారికవలస, బోరవానిపాలెం, ఉప్పాడ, మంగమారిపేట, సాగర్‌నగర్, రుషికొండ, ఎండాడ ప్రాంతాల్లో వేకువజామునే భోగి మంటలు వేసుకున్నారు. పలు చోట్ల రంగవల్లులు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



కొమ్మాదిలో భోగి మంట వద్ద స్థానికులు